

ముంచుకొస్తోంది: కోనసీమ జిల్లా ఓడలరేవులో భారీగా కోతకు గురైన సముద్రతీరం



ముక్కలు..చెక్కలు: ఉప్పాడ వద్ద రోడ్డు కోత



ముప్పు ముంచుకొస్తోంది.. సముద్రతీరం భారీగా కోతకు గురవుతోంది. అలజడి రేపు తోంది..అటు కాకినాడ.. ఇటు కోనసీమ జిల్లాల్లో వేలాది ఎకరాల విలువైన భూములు సముద్రగర్భంలో కలిసిపోతున్నాయి. రహదారులు, సరుగుడు తోటలు, మడ అడవులు కళ్లె దుటే కడలిలో కలిసిపోతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సముద్ర తీరం వెంబడి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

కల్లోల..కడలి!

- కడలి కోపాగ్నికి కరుగుతున్న తీరం
- ఉప్పాడలో కోత నివారణకు కసరత్తు
- సీఎం ఆదేశాలతో కేంద్రానికి కలెక్టర్ లేఖ
- రూ.320 కోట్ల నిధులు కోరిన వైనం
- కేంద్రం నుంచి సానుకూల స్పందన
- శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్యయనం
- కోనసీమలో మునుగుతున్న ఊళ్లు

(కాకినాడ/ అమలాపురం, ఆంధ్రజ్యోతి)

ఏళ్ల తరబడి ఉప్పాడను వేధిస్తోన్న సముద్రపు కోతకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా ప్రభుత్వం అడు గులు ముమ్మరం చేసింది. ఐదేళ్లుగా కోత తీవ్రతతో నష్టం పెరిగినా అప్పటి వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉప్పా డను సముద్రపు కోత నుంచి కాపాడేందుకు వడివడిగా అడుగులు పడుతు న్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సముద్రపు కోతపై జరిగిన చర్చలో కోత నివారణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టేలా పర్యవేక్షిం చాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ఇటీవల కలెక్టర్ కేంద్రానికి లేఖ రాశారు. రూ.320 కోట్లతో 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు ప్రణా ళిక సిద్ధం చేశామని వివరించారు. సీఎం ఆదే శాలతో ఈ ప్రతిపా దనపై జాతీయ విపత్తుల నిర్వహణ సం స్థతో సంప్రదింపులు ఆరం భించింది. నష్ట నివారణ నిధుల విడుదలకు దాదా పు సమ్మతించింది.ఈ తర హా ప్రతిపాదనలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చినట్టు వివరించింది. ఉ ప్పాడ కోత తీవ్రత దృష్ట్యా త్వరలో నిధులు విడుదలకు మార్గం సుగమం అ వుతుందని అధికారులు భావిస్తున్నారు.

కోతకు అడ్డుకట్ట ఇలా

డిప్యూటీ సీఎం పవన్ జోక్యంతో కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్ర వేత్తలు వచ్చి ప్రత్యేక కార్యాచరణ ప్రణా ళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు. ప్రధానంగా ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు.దానిని తగ్గించ గలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఉప్పాడ వద్ద తీరం నుంచి 170 మీటర్ల లోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రా పాడ్‌లు కలపనున్నారు.టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి.వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గి కోత నెమ్మది స్తుంది. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది.ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్ సృష్టించాలని ప్రతిపాదించారు. శాస్త్రవేత్తలు పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి.నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. డ్రెడ్జింగ్ చేసిన సమయంలో వచ్చే ఇసుకను ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. ఏడాదికి 50 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేయాలని నిర్ణయించారు.ఇలా 12 కిలోమీటర్ల మేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.320 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

20 ఏళ్లుగా ముందుకు..

కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద స ముద్రం 20 ఏళ్లుగా భారీగా ముందుకు వచ్చేసింది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో తీరం అల్లకల్లోలంగా మారుతోంది. కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు, రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు సముద్ర గర్భంలో కలిసి పోయాయి.అధికారంలోకి వస్తే కోత నివారణకు శాశ్వత చర్యలు చేపడ తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది.దీనికి తగ్గట్లుగా అడుగులు వేస్తుంది.

కోనసీమకూ.. గుండెకోత

కోనసీమలో సముద్రతీరం తీవ్రంగా కోతకు గురవుతోంది. వందల ఎకరాల భూములు కడలిలో కలిసిపోతున్నాయి. కోనసీమ జిల్లా 8 మండలాల పరిధిలో 48 కి.మీ. మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఒక వైపు ఇసుక మాఫియా ప్రతినిధులు తీరాన్ని తవ్వేస్తుంటే మరో వైపు సముద్రం ముందుకు దూసుకొస్తూ ఊళ్లను ముంచెత్తుతోంది. భైరవపాలెంలోని సముద్రతీర ప్రాంతం నుంచి బ్రహ్మసమేధ్యం, చిర్రయానాం, ఎస్.యానాం, వాసాలతిప్ప, కొమరిగిరిపట్నం,ఓడలరేవు, కేశనపల్లి, కరవాక, చింతలమోరి, అంతర్వేది తీరం వరకు సముద్రం భారీగా కోతకు గురవుతోంది. భవిష్యత్‌లో ఆందోళనకరమైన పరిణామాలకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. ఓడలరేవు తీరప్రాంతంలో వేలాది కోట్ల విలువైన చమురు సంపదను తరలించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ ప్లాంటుకు సంబంధించి భారీ నిర్మాణాలకు చేరువగా సము ద్రం ముందుకొచ్చింది. ఇటీవల తీరం అల్లకల్లోలం కావడంతో గతంలో ఓ కాంట్రాక్టు సంస్థ నిర్మించిన రక్షణ గోడ ఇప్పుడు ఛిద్రమై ప్లాంటు గోడ కూడా కోతకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీంతో ఓఎన్జీసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సముద్రం వెంబడి పటిష్ఠమైన, అత్యాధునికమైన టెక్నాలజీతో కూడిన గోడను నిర్మించుకునేందుకు త్వరలోనే ఆ సంస్థ అధికారులు టెండర్లు పిలుస్తారని ఇక్కడ ప్రచారం జరుగుతోంది. కాగా ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్స్‌కు కూడా రాగల రోజుల్లో ముప్పు పొంచి ఉందని భావిస్తున్నారు.



హై పర్..టెన్షన్!

కాకినాడలో హైపర్ టెన్షన్, గుండెజబ్బుల ముప్పు

- ఎన్‌సీడీ సర్వేలో కీలకాంశాలు
- హైపర్‌టెన్షన్ బాధితులు ఎక్కువ
- రాష్ట్రంలో జిల్లాకు రెండోస్థానం
- 7,451 మందికి కిడ్నీ వ్యాధి
- నియోజకవర్గానికో పెద్దాసుపత్రి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లా వివిధ రకాల ప్రమాదకర వ్యాధుల ముప్పున వేలాడుతోంది. మారుతోన్న ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడంతో అనేకరకాల జబ్బులు జిల్లా వాసులపై పంజా విసరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ సర్వే చాటుతోంది.ఈ మేరకు ఎన్‌సీడీ 2.0 సర్వే నివేదికను సీఎం చంద్రబాబు సోమవారం అమరావతిలో వైద్య ఆరోగ్యశాఖపై ఇచ్చిన ప్రజంటేషన్ సందర్భంగా వెల్లడించారు. కొంత కాలం కిందట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా ఎన్‌సీడీ (నాన్ కమ్యునబుల్ డిసీజ్) సర్వే 2.0 నిర్వహించింది. వివిధ ఆసుపత్రుల నుంచి డేటాను సేకరించి జిల్లాలో ఏ వ్యాధి ఎక్కువగా ఉందనే దానిపై ఆన్‌లైన్‌లో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. దీని ప్రకారం కాకినాడ జిల్లాలో హైపర్ టెన్షన్, గుండె సంబంధిత జబ్బులు, గుండెపోటు ముప్పు అధికంగా ఉన్న జాబితాలో ఉన్నట్టు తేలింది. ఒక్క హైపర్ టెన్షన్ ఉదాహరణగా తీసుకుంటే ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 19.78 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతుండగా..కాకినాడ జిల్లాలో 1,06, 334 మందిని గుర్తించారు. వీరిలో 50 నుంచి 54 ఏళ్ల వయసులో ఉన్న వారు అధికం. డయాబెటిస్‌లో జిల్లా 15వ స్థానంలో నిలిచింది.44,151 మంది బాధితులు ఉన్నట్టు సర్వేలో గుర్తించారు.వీరిలో 45 నుంచి 49 ఏళ్ల వయసు వారు అధికంగా ఉన్నారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్ కలిపి జిల్లాలో 1,02,180 మంది బాధితులుగా ఉన్నట్టు ఇంటింటా సర్వేలో తేలింది. కార్డియోవాస్క్యులర్ డిసీజ్ జిల్లాలో 9,171 మందికి ఉన్నాయి. అన్నింటికంటే ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించి జిల్లాలో ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించగా 6,333 కేసులు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోనే ఇన్ని అనుమానిత కేసులు ఒక్క కాకినాడలోనే ఉన్నాయి. ఇన్ని కేసులతో జిల్లా తొలిస్థానంలో నిలిచింది. అయితే వీరికి మలివిడత పరీక్షలు నిర్వహించి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స అందిస్తామని అధికారులు చెబుతున్నారు. మరో పక్క జిల్లాలో లివర్ వ్యాధులు ఉన్న వారి సంఖ్య 1,139గా గుర్తించారు. ప్రధానంగా ఆల్కహాలిక్ వల్ల ఈ సమస్యలు ఉన్నట్టు భావిస్తున్నారు. మరోపక్క క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్(సీవోపీడీ) బాధితులు 1,456గా గుర్తించారు. నరాల సంబంధిత సమస్యలు ఉన్న వారు జిల్లాలో 5,274 మంది ఉన్నారు. తీవ్రమైన కిడ్నీ వ్యాధితో 7,451 మంది సతమతమవుతున్నట్టు సర్వేలో తేలింది. ఒక రకంగా చెప్పాలంటే క్రానిక్ కిడ్నీ వ్యాధి కేసుల్లో జిల్లా రాష్ట్రంలో పదో స్థానంలో ఉంది.

నియోజకవర్గానికో మల్టీ స్పెషాలిటీ..

రాష్ట్రంలో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. నియోజకవర్గంలోనే అన్ని రకాల ఆధునిక వైద్య సదుపాయాలు అందించాలని సంకల్పించింది.దీనిలో భాగంగా నియోజకవర్గానికో వంద నుంచి మూడొందల పడకల స్థాయిలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించాలని నిర్ణయించింది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి రెండు నియోజకవర్గాల్లో ఇవి ఇప్పటికే ఉన్నట్టు గుర్తించింది. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో వీటిని నిర్మించడానికి కసరత్తు ప్రారంభించింది. మరోపక్క ఎప్పటికప్పుడు జిల్లాలో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రభుత్వం నిరంతర సర్వే జరపబోతోంది.ఇప్పటికే ఎన్‌సీడీ 2.0 పూర్తవగా, ఇప్పుడు 3.0 ప్రారంభించింది.

పట్టుపరుపేలనే.. అమ్మఒడి చాలునే..



తల్లి ఒడిలో సేదతీరుతున్న చిన్నారి..

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు సోమవారం అర్జీదారులు పోటెత్తారు. భారీ సంఖ్యలో కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 478మంది తమ అర్జీలను అందజేశారు. వీరికి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో చెట్ల కింద, కలెక్టరేట్ ఆవరణలో బయట కుర్చోవాల్సి వచ్చింది. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లల తల్లులు.. ఎండను సైతం లెక్కచేయకుండా అలానే వేచి ఉండి తమకు సమయం వచ్చేవరకు ఎదురు చూశారు. వీరికి నీడ కల్పించాల్సిందని పలువురు అభిప్రాయపడ్డారు.

-ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ





కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీదారులు

- 478 అర్జీల స్వీకరణ



కలెక్టరేట్ ఆవరణలో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో చెట్ల కింద వేచి ఉన్న అర్జీదారులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నిర్దీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిరాద్యుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్‌పీడీ సత్యనారాయణలతో కలిసి అర్జీలను స్వీకరించారు. సోమవారం కాకినాడకలెక్టరేట్‌కు అర్జీదారులు పెద్దఎత్తున పోటెత్తారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ్యవస్థలో అందిన వినతుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 478 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కెఎస్‌ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి పాల్గొన్నారు.

‘పన్నుల’ పండువగా..

- పన్ను రిబేటుకు విశేష స్పందన
- ఆశాజనకంగా తొలిరోజు వసూళ్లు
- కాకినాడ కార్పొరేషన్ పరిధిలో వసూలుకు ప్రత్యేక కౌంటర్లు



పన్ను చెల్లింపుదారులతో కిటకిటలాడుతున్న రెవెన్యూ విభాగం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పిస్తూ సోమవారం నుంచి 5శాతం పన్ను రిబేటు కల్పించింది. దీంతో పన్ను చెల్లింపుదారులు నగరపాలకసంస్థ కార్యాలయం, సచివాలయంలో పన్ను చెల్లింపులు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం లేకపోయినా తొలిరోజు వసూళ్లు ఆశించినరీతిలో సాగాయి.

కాకినాడ నగరపాలక సంస్థ యంత్రాంగం పన్ను వసూలుకు సన్నాహాలు చేపట్టింది. ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించింది. కాకినాడ సినిమారోడ్డులోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సివిక్ సెంటర్, స్థానిక కొండయ్యపాలెం శారదాదేవి గుడి సమీపంలోని కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలోనూ సోమవారం నుంచి ఐదు శాతం రిబేటుతో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు కట్టించుకున్నారు. నగరంలోని సచివాలయాల్లోనూ పన్నులు కట్టించుకునేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

30 వరకు అవకాశం

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో 84 వేల ఇంటిపన్ను ఎసెస్‌మెంట్లు, ఐదు వేల ఖాళీ స్థలాల అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి 2025-2026 సంవత్సరానికి ఇంటి పన్నుల డిమాండ్ రూ.48కోట్లు, ఖాళీ స్థలాల పన్ను డిమాండ్ రూ.5.52కోట్లుగా ఉంది. ఈనెల 30వ తేదీ వరకు ఐదుశాతం రిబేటుతో పన్ను చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఏడాది పన్ను ఒకే దఫాలో చెల్లించాల్సి ఉంది. అర్ధసంవత్సరం పన్ను చెల్లించేవారికి ఈ రిబేటు వర్తించదు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఆర్‌టీ నెం:267 మేరకు 2025 మేరకు 2025-2026 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై 5శాతం డిస్కౌంట్ పొందండి అంటూ నగరపాలక అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు సోమవారంనుంచి ప్రజలకు డిమాండ్ నోటీసులు పంపిణీ చేయనున్నట్టు నగరపాలక కమిషనర్ భావన తెలిపారు. ప్రజలు ఇంటి పన్ను నెంబర్, డోర్ నెంబర్‌తో పన్ను చెల్లింపు కేంద్రానికి వచ్చినాగానీ పన్ను చెల్లింపు చేయవచ్చని వెల్లడించారు.

నీటి పన్నుల డిమాండ్ రూ.16కోట్లు

నగరంలో 44వేల కుళాయి కనెక్షన్లు, 2300 మీటర్ ట్యాపులు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.16కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. గతేడాది రూ.10కోట్లు వసూలు కాగా, రూ.6కోట్ల పాతబకాయిలున్నాయి. ఈ ఏడాది రూ.16కోట్లు(పాత లెక్కల ప్రకారం) రావాల్సి ఉంది. కొత్త లెక్కల ప్రకారం ఈ డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. నీటి పన్ను వసూళ్లను చేపట్టేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

చెత్త పన్ను నుంచి ఊరట..

గత వైసీపీ ప్రభుత్వం చెత్తపై విధించిన పన్నుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెనుకబడిన ప్రాంతాల్లో నెలకు రూ.60, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో నెలకు రూ.90 చొప్పున ఇళ్ల నుంచి పన్ను వసూలు చేసేవారు. దీంతో వెనుకబడిన ప్రాంతాల్లో 40వేల ఇళ్లు ఉండగా చెత్త పన్ను రూపంలో నెలకు రూ.24 లక్షలు వసూలు చేసేవారు. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రూ.36లక్షలు చెత్త పన్ను వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని నెలలకే ఈ పన్నును ఎత్తివేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 62 అర్జీలు



సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

కాకినాడ క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లానలుమూలలనుంచి విచ్చేసిన 62మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుని సకాలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు.

వెంకన్న క్షేత్రం.. కల్యాణ సంబరం

- వాడపల్లి వెంకన్న దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభం 7



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

యనమల రాజకీయ ప్రస్థానంపై పుస్తకం

- 10న తునిలో పుస్తకావిష్కరణకు ఏర్పాట్లు 7

‘తూర్పు’లో జడ్జీల బదిలీ 7

నేటి నుంచి కాకినాడలో ఇండో-అమెరికా సైనిక విన్యాసాలు

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి 7

గ్రామ, వార్డు పరిధిలో సర్వేలను వేగవంతం చేయాలి

ఆదేశించిన ఆర్టీజీఎస్ సీఈవో

కలెక్టరేట్(కాకినాడ)ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సిబ్బందితో నిర్వహిస్తున్న వివిధ సర్వే ప్రక్రియలను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న వివిధ రకాల సర్వేల పురోగతిపై జీఎస్డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి, ఆర్టీజీఎస్ సీఈవో భాస్కర్ సోమవారం అమరావతినుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా చేపట్టిన వర్క్‌ఫ్రం హోం ఇతరసర్వే ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 0-6 చిన్నారులకు ఆధార్ ఎన్రోల్మెంట్, సచివాలయసిబ్బంది హేతుబద్ధీకరణ, వాట్స్ అప్ గవర్నెన్స్ వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వం ఈసర్వే ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టినందున జిల్లా స్థాయి అధికారులు సర్వేల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా పంచాయితీ అధికారి రవికుమార్, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు వాసుదేవరావు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఐఈసీ ఉద్యోగానికి దరఖాస్తులకు ఆహ్వానం

సమగ్రశిక్ష సీఎంవో నాగేశ్వరరావు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్(ఐఈసీ) ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ, మున్సిపాల్టీ యాజమాన్యాల్లో పనిచేస్తున్న 8ఏళ్ల సర్వీస్ నిండి పీజీలో స్కూల్ సబ్జెక్టులు, ప్రత్యేక విద్యలో 45 లేదా 90 రోజుల ఫౌండేషన్ కోర్సు పూర్తిచేసిన 55ఏళ్ల లోపు వయస్సుగల ఎస్ఏల నుంచి ఫారెన్ సర్వీసెస్ నిబంధనల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 12లోపు కాకినాడ సమగ్రశిక్ష కార్యాలయంలోని జిల్లా అదనపు పథక సమన్వయకర్తకు సమర్పించాలన్నారు.

వెంకన్న క్షేత్రం.. కళ్యాణ సంబరం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం


ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ

- వాడపల్లి వెంకన్న దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణంతో అంకురార్పణ
- నేడు తీర్థం, రథోత్సవం, కల్యాణం

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు దశమి సోమవారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. వేకువజామునే మేల్కొపు, నిత్యబలిహరణ, బాలభోగ నివేదన, నిరాజన మంత్రపుష్పం అనంతరం భక్తులకు దర్శనాలు, సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, దీక్షాధారణ, వాస్తు పూజ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణంతో కార్యక్రమాలను నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేద పడింతులు ధ్వజపతాకం ఎగురవేసి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఏకాదశి మంగళవారం స్వామివారిని మేల్కొపి భక్తులకు దర్శనాలు అందిస్తారు. మధ్యాహ్నం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించి వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి శ్రీనివాస ప్రాంగణంలోని సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్ద జగత్ కల్యాణార్థం స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావులు కలిసి కల్యాణ వేదిక, పుష్కరఘాట్లు, రథోత్సవం నిర్వహించే మాడవీధులు, భక్తుల సౌకర్యాలపై పరిశీలించి చర్చించారు. వివిధ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు వస్తున్న దృష్ట్యా పార్కింగ్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు.



పిండి ముగ్గుతో స్వామి చిత్రం

కడియం బుర్రిలంకకు చెందిన రూప అనే భక్తురాలు సోమవారం పిండి ముగ్గుతో శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రం గీసి ఆకట్టుకుంది.

విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు

శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అలంకరించే పనిలో నిపుణులు నిమగ్నమయ్యారు. 10వేల మంది వీఐపీలు, భక్తులు, ప్రముఖులు, స్వామివారి కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక, లొల్ల నుంచి వాడపల్లి వరకూ స్వాగత ద్వారాలు, ఎల్ఈడీ విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంతో పాటు మాడవీధులు దేవతామూర్తులతో పాటు విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలంకరించారు.



యనమల రాజకీయ ప్రస్థానంపై పుస్తకం

10న తునిలో పుస్తకావిష్కరణకు ఏర్పాట్లు

ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత


తునిలో కూటమి నాయకులతో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా అశోక్‌బాబు

తుని రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై '42వ వసంతాల యనమల రాజకీయ ప్రస్థానం' పేరుతో పుస్తకం ప్రచురించారు. ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో ఈ పుస్తకావిష్కరణ, ఆత్మీయ సన్మాన వేడుకను అట్టహాసంగా నిర్వహించేందుకు కూటమి శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా తునిలో మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబు పార్టీ శ్రేణులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 42 ఏళ్ల యనమల రాజకీయ ప్రస్థానంలో ఆయన మచ్చలేని నాయకుడిగా వెలుగొందారని, ఇది రాజకీయాల్లో అద్భుత ఘట్టమని అన్నారు. సుదీర్ఘ రాజకీయాల్లో యనమల స్పీకర్‌గా, పలుమార్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చేలా స్ఫూర్తిదాయకమైన పాలన అందించారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలకమైన వ్యక్తిగా గొప్ప వ్యక్తిత్వం ఉన్న తుని ప్రాంతవాసి అయిన ఆయనను ఈ నెల 10న తునిలో సత్కరించుకునే అవకాశం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారని తెలిపారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు కూడా హాజరుకానున్నారన్నారు. కూటమి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొచ్చెర్లపాటి రూపాదేవి, మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మాజీ కౌన్సిల ర్లు మళ్ల గణేష్, జల్లు వాసు, కుక్కడుపు బాలాజీ, టీడీపీ నాయకులు తమరాన సత్యనారాయణ, ఆవుగడ్డి వెంకటరమణ, తమరాన రామకృష్ణ, కోడా వెంకటరమణ పాల్గొన్నారు.

'ఉమ్మడి తూర్పు'లో జడ్జీల బదిలీలు

రాజమహేంద్రవరం/కాకినాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్‌గౌతమ్ 12వ అదనపు జిల్లా జడ్జిగా విశాఖపట్నం, పిఠా పురం 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.వా సంతి నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడలో మూడో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న పి.కమలాదేవి కర్నూలు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా.. అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేశ్ అనకాపల్లి పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడ ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత ఆర్.వోరా నెల్లూరు ఫ్యామిలీ కమ్ ఆరో అదనపు జిల్లా జడ్జిగా, రాజమహేంద్ర వరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి ఆర్.శ్రీలత మదనపల్లె ఏడో అడిషనల్ జి ల్లా జడ్జిగా, ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయ మూర్తి పీవీఎస్ సూర్యానారా యణమూర్తి మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జిగా, రామచంద్రాపురం అదనపు జిల్లా జడ్జి ఎం.శంకరరావు చిత్తూరు పోక్సో కోర్టు జడ్జిగా, అనంతపురం జిల్లా గూటిలోని 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరిని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన నేతల మధ్య భగ్గుమన్న విభేదాలు

- జనసేన నాయకుడిపై అయినవిల్లి మండలాధ్యక్షుడు హత్యాయత్నం
- మండలాధ్యక్షుడు కారు ధ్వంసం చేసిన వ్యతిరేక వర్గీయులు
- ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన అయినవిల్లి పోలీసులు



పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ప్రశ్నిస్తున్న ఉమా వర్గీయులు

అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోలేటి ఉమా

అమలాపురం/అయినవిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పి.గన్నవరం ఎస్సీ రిజర్వు నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి జనసేన నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. జనసేన నాయకుడిపై మండలాధ్యక్షుడు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి తాలూకా బంధువులు మండలాధ్యక్షుడి వాహనాన్ని ధ్వంసం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. క్షతగాత్రుడిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించడానికి వచ్చినప్పుడు బాధితుడి బంధువులు ఎమ్మెల్యేపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ వ్యవహారంపై ఇద్దరు నాయకుల మధ్య వచ్చిన విబేధాలు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అయినవిల్లికి చెందిన జనసేన నాయకుడు తోలేటి ఉమా ఇంటిపై మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ తన అనుచరులతో కలిసి వెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఉమా, అతని భార్యపై రాజేష్‌తో పాటు మరికొందరు దాడి చేసి ఉమాను తీవ్రంగా గాయపరిచారు. ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో అడ్డువచ్చిన అతని భార్యపై కూడా దాడికి తెగబడ్డారు. తలపై బలమైన గాయం తగిలిన ఉమాను అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తోలేటి ఉమాపై దాడి చేసిన పోలిశెట్టి రాజేష్ ఇంటిపైకి ఉమా వర్గీయులు ఎదురు దాడికి వెళ్లి బయట ఉన్న రాజేష్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం మండలంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అయితే గాయపడ్డ తోలేటి ఉమాను పరామర్శించేందుకు సోమవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రికి వచ్చిన క్రమంలో ఆయనతో ఉన్న కొందరు నాయకులు మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ వీడియోలు తీయకుండా అడ్డుకున్నారు. పరామర్శ అనంతరం బయటికి వచ్చిన ఎమ్మెల్యే సత్యనారాయణను బాధితుడైన ఉమా వర్గం నాయకులు నిలదీశారు. పార్టీ మండలాధ్యక్షుడై ఉండి ఈ విధంగా దాడులకు పాల్పడ్డగా ఏం చర్యలు తీసుకుంటారంటూ గట్టిగా నిలదీశారు. దాంతో ఈ వివాదంపై జనసేన పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తూ లేఖ రాస్తానని, ఇది మా కుటుంబ సమస్య చర్చించి పరిష్కరించుకుంటామంటూ సమాధానమిచ్చారు. అయితే ఈ వివాదంపై అయినవిల్లి పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి కేసులు నమోదు చేశారు. దీనిలో భాగంగా బాధితుడైన ఉమా భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యర్థి వర్గానికి చెందిన జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, అబ్బిరెడ్డి యుగంధర్, పోలిశెట్టి రవి, మరో ఇద్దరిపై సెక్షన్ 329 (4), 109 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా రాజేష్ కారు ధ్వంసానికి సంబంధించి రాజేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 361(6), 329(3), రెడ్ విత్ 35 సెక్షన్ కింద అయినవిల్లి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన సంతకాలు ఆటోగ్రాఫ్‌గా మారాలి

ఉన్నత లక్ష్యాలతోనే దేశాభివృద్ధి : విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ


నన్నయ విశ్వవిద్యాలయంలో లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నన్నయ వీసీ, అధికారులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనల్ని చూసి గర్వపడడం, చదువుకున్న విద్యాసంస్థకు ముఖ్యఅతిథులుగా రావడం, మన సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం వంటి మూడు విషయాలను యువత లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఇటువంటి లక్ష్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం జాతి నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి యువత మొబైల్‌ఫోన్‌లతో బిజీగా ఉన్నారని రీల్స్‌షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మద్యం నాన్న రక్తం, ధూమపానం అమ్మ ఊపిరి తాగుతున్నాం అని గుర్తు చేసుకోవాలన్నారు. మన స్నేహితులు మంచి వారై ఉండాలని తద్వారా మనం ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్నారు. మహనీయుల చరిత్రను చదువుకోవాలని చెప్పారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యువత ఒక దేశ బలం, పురోగతికి మూలస్తంభాలుగా ఉంటారన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావడంలో యువత గణనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బలమైన నైపుణ్యంగల యువత భారత దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి పాత్రను వివరించారు.

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన శివ

పెద్దాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మం డలం వాలుతిమ్మాపురం రహదారిలో ఉన్న ఓ రైస్ మిల్లులో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ నగరానికి చెందిన వేముల శివ (29) ఫ్యాక్టరీకి పని మీద వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇంతలో బాయిలర్ నుంచి విడుదలైన వేడి నీటి కారణంగా మృతిచెందినట్టు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై సీఐ విజయశంకర్ ఆదేశాలతో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మాంసం వ్యాపారికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 7 (ఆం ధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో మాంసం వ్యాపారి తీ వ్రగాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన పిల్లి అప్పారావు సోమవారం మేకలు కొనుగోలు చేసేందుకు చేబ్రోలు మోటార్‌సైకిల్‌పై వెళ్తు న్నాడు. పట్టణ శివారులోని రైసుమిల్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అప్పారావుకు తీ వ్రగాయాలై అ పస్మారక స్థితికి చేరుకున్నాడు. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా

ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్‌కు గాయాలు


కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడిన వ్యాన్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులో కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా పడి ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్ గాయపడ్డారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని ఒక ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన స్కూలు మినీ వ్యాన్ చెందుర్తిలో పది మంది విద్యార్థులను ఎక్కించుకుని బయల్దేరింది. చెందుర్తి శివారులోకి వచ్చేసరిగా ఎదురుగా వస్తున్న లారీ మీదకు రావడంతో మినీవేన్‌ను డ్రైవర్ తప్పించబోయాడు. అదుపు తప్పడంతో కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జి.హర్షిత, అపర్ణ, సిద్ధు, ధరణి, కె.భార్గవ్, హాసిని, నిహారికలకు గాయాలయ్యాయి. డ్రైవర్‌కు కాళ్లు విరిగాయి. పాఠశాల యజమాన్య ప్రతినిధులు వారిని చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఒక విద్యార్థిని మాత్రం కాలువలో నీరు ఎక్కువగా తాగడంతో అస్వస్థతకు గురైంది. క్షతగాత్రులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని తమ వారికి ఏమైందోనని ఆందోళనకు గురయ్యారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

21.6 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

రాజానగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 3 వాహనాలను రాజానగరం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై రాజానగరం పరిధిలోని జీఎస్ఎల్ సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 3 వాహనాలను ఏక కాలంలో పట్టుకుని సీజ్ చేశామన్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39-యు.బి 1314 వాహనంలో 15,390 కిలోల బియ్యం, పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39 యు.ఎ 6550 నంబరు గల వాహనంలో 3,670 కిలోలు, కోనబాలరాజు డ్రైవర్ ఉన్న ఏపీ39-యు.ఐ 5549 నెంబరు కలిగిన వాహనంలో 2,540 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు పేర్కొన్నారు. పౌరసరఫరాలుశాఖ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం కోర్టులో నిత్యావసర వస్తువుల చట్టం కింద బియ్యం, డ్రైవర్లతో పాటుగా వాహన యజమానులపై సెక్షన్ 6ఏ కేసు నమోదు చేసి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.9,93,600, వాహనాల విలువ రూ.20 లక్షలు కలిపి మొత్తం విలువ రూ.29,93,600గా నిర్ధారించామన్నారు.


రేషన్ బియ్యంతో స్వాధీనం చేసుకున్న వాహనాలు

నేటి నుంచి కాకినాడలో

ఇండో-అమెరికా సైనిక విన్యాసాలు

130 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్‌డీపీవో

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో ఈ నెల 8 నుంచి 13 వరకు జరిగే ఇండో-అమెరికా సైనిక విన్యాసాల టైగర్ ట్రయాంఫ్-25 కోసం 130 మంది పోలీసులతో కట్టుదిట్టమైన పటిష్ఠ భద్రతా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సూర్యారావుపేట బీచ్‌లో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ లు, ఏఎస్ఐలు, హెచ్‌సీ, పీసీలతో బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. సైనిక విన్యాసాలు జరిగే రోజుల్లో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు నిషేధిత ప్రాంతాల్లోకి రాకూడదన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు ఎటు వంటి వాహనాలకు ప్రవేశం లేదన్నారు. సైనిక విన్యాసాల్లో పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఇరుదేశాల త్రివిధ దళాల అధికారులు, సిబ్బందికి వసతి, ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం సైనిక విన్యాసాలు జరిగే నావెల్ ఎన్‌క్లేవ్ పరిసర ప్రదేశాలను పరిశీలించారు. తిమ్మాపురం ఎస్ఐ, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత పాల్గొన్నారు.


సూర్యారావుపేట బీచ్‌లో బందోబస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, సీఐ చైతన్యకృష్ణ

గంజాయితో వ్యక్తి అరెస్టు

21 కిలోల స్వాధీనం : డీఎస్పీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం తూర్పు శివారు జగనన్న కాలనీ వద్ద సీతారామచెరువు వద్ద అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మరుకుర్తి సూర్యప్రకాష్‌ను 21 కిలోల గంజాయితో ఎస్ఐ అరెస్ట్ చేసినట్టు రాజమహేంద్రవరం డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం రాత్రి ఆమె బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. సూర్యప్రకాష్ పదో తరగతి వరకూ చదివి మానేసి అతడి బావతో కలసి చికెన్ షాపు నిర్వహించేవాడు. ఆపై అతడితో గొడవ పడి అల్లూరి సీతారామరాజు జిల్లా కె.పెదబయలు గ్రామానికి చెందిన వంతల పంతులుబాబుతో కలిసి ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకున్నాడు. వారిద్దరూ జి.మాడుగుల చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొని వాటిని ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకునేవారు. ఆ తర్వాత ప్రకాష్ కాకినాడ జిల్లా ఉప్పాడలో చికెన్ సెంటర్‌లో పనికి చేరాడు. అదే సమయంలో అతడికి పాత నేరస్తుడైన స్నేహితులు ఆవాల మణికంఠ, తోలం రాజు పరిచయమయ్యారు. ముగ్గురూ కలిసి మోటార్‌సైకిళ్ల దొంగతనాలు చేద్దామనుకుని మార్చి మొదటివారంలో బిక్కవోలులో రెండు బైక్‌లు దొంగతనం చేశారు. వాటిలో ఒక దానిని ప్రకాష్.. పంతులుబాబుకు ఇచ్చి దానికి బదులుగా సుమారు 21 కిలోల గంజాయిని తీసుకున్నాడు. ఆపై బిక్కవోలు గ్రామం శివారుకు వచ్చి స్నేహితులైన మణికంఠ, రాజు కోసం వేచి చూస్తుండగా సమాచారం మేరకు ఎస్ఐ రవిచంద్ర కుమార్ అరెస్టు చేశారని, పంతులుబాబు పరారీలో డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ సుమంత్,ఎస్ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

లారీల లింక్.. డేంజర్ బ్లింక్..

మరమ్మతులకు గురైన లారీ ముందు భాగాన్ని మరో లారీకి కట్టి తీసుకెళ్తున్న దృశ్యం కాకినాడ జిల్లా బెండపూడి నుంచి రాజమహేంద్రవరం వైపు నేషనల్ హైవేపై కనిపించింది. అయితే ఏమాత్రం ఆ లారీల లింక్ తెగినా వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు.

-ఫొటోగ్రాఫర్, కాకినాడ



ఏకకాలంలో పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

పిఠాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్నులను ఏకకాలంలో చెల్లిస్తే ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనరు కనకారావు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు చెల్లించిన వారికే రాయితీ వర్తిస్తుందని, పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇవి సెలవు దినాల్లోనూ పనిచేస్తాయని చెప్పారు.



డ్వామా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టెక్నికల్ అసిస్టెంట్లు

ఆరేళ్లుగా జీతాలు పెంచలేదు

డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టర్‌కు టెక్నికల్ అసిస్టెంట్ల వినతి

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న డ్వామా కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంచు మహాలక్ష్మి మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లకు ఆరేళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. పీఆర్సీ కూడా అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం ఆకస్మిక తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తనిఖీ అధికారులు నాలుగు వారాలు జరిగిన పనులను కొలతలు తీయకుండా, ఒక రోజు జరిగిన పనులను కొలతలు తీస్తున్నారన్నారు. ఇటీవల తుని, తొండంగి మండలాల్లో పనులను పరిశీలించి రూ.11.96 లక్షలు రికవరీకి ఆదేశించారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించకుండా రికవరీకి ఆదేశించడం తగదన్నారు. ఉపాధి కూలీలు అధిక శాతం మహిళలు, వృద్ధులు ఉండడం వలన వారిలో పని సామర్థ్యం తగ్గిందన్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ఒకరోజు సగటు వేతనం రూ.300 చెల్లించే పరిస్థితి లేదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకునే ముందు వివరణ తీసుకోవాలన్నారు. అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్, ప్రతినిధులు ప్రసాద్‌రావు, శ్రీనివాస్, నాని బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యా శాఖ అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు భారతి

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యా కిట్‌ల పంపిణీ

సామర్లకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్‌లు అందించేందుకు క్షేత్ర స్థాయిలో అన్ని చర్యలు తీసుకున్నామని విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకురాలు బి.భారతి పేర్కొన్నారు. సామర్లకోట ప్రభుత్వ జీటీడబ్ల్యుఏ పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆమె సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు, సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాలను నూరుశాతం అమలు చేసేందుకు పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి పంపిణీకి ఎక్విడెన్స్ తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలితో అనారోగ్య రుగ్మతలు సంభవిస్తున్నాయని, ఆరోగ్యకరమైన, ఆశాజనక భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డాక్టర్ కె.ప్రభాకరరావు, జి.దేవకుమారి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా విద్యాలయంలో వైద్య శిబిరం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నగరంలోని గోకులం సమీపంలో గల ప్రజా విద్యాలయంలో అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వడ్డి రాజా, డాక్టర్ రేఖాదేవి, డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డి 100 మందికి పైగా పిల్లలకు సాధారణ, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ల తాతారావు, జిల్లా పూర్వ గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి, క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ దిలీప్‌కుమార్ సదనాని, కార్యదర్శి డి.రామకృష్ణ, కోశాధికారి దామిశెట్టి శ్రీనివాసరావు, ప్రజా విద్యాలయం కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, క్లబ్ సభ్యులు ఏవీఎస్ నాథ్, జె.కృష్ణప్రసాద్, వై.మురళీధర్, డీఎల్ శాస్త్రి, సేతు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'జనసేనలో మహిళలకు సముచిత స్థానం'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేనలో మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం 2వ డివిజన్ శశికాంత్ నగర్‌లో మహిళా నాయకురాలు సెలీన్‌ప్రియ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)తో పాటు జనసేన, టీడీపీ నాయకులను సత్కరించారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, పిల్లరిశెట్టి రాజేశ్వరి, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, పుల్ల శ్రీరాములు, కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, దేవు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రులు

స్వయంవర పార్వతి అమ్మవారికి విశేష పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్ర మహోత్సవాలు ముగింపు సందర్భంగా సామర్లకోట కంచి మహా సంస్థానం స్వయంవర పార్వతి అమ్మవారికి సోమవారం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతుల పర్యవేక్షణలో పండితుడు చీమలకొండ గోపాలం తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వయంవర పార్వతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి హోమ పూజలు జరిపారు. అనంతరం స్వయంవరపార్వతి అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. సామర్లకోట, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, భీమన్న మంత్రోచ్ఛారణలతో విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

తొమ్మిది నెలల పాలనలో పార్టీలకతీతంగా అభివృద్ధి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల పాలనలో కాకినాడ రూరల్ మండలంలో సుమారు రూ.30 కోట్లతో సిమెంట్ రోడ్లు, లింక్ రోడ్లు నిర్మించామని, మౌలిక వసతుల కల్పనలో పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాములు చేశామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం రమణయ్యపేట లోని మండల కార్యాలయంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సక్రమ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరందించాలన్నారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తుఫాన్లు, వరద ముంపు సమస్య పరిష్కారం కోసం గోదావరి కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. క్యాన్సర్ నిర్ధారణకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న 10 మీటర్ల వెడల్పు సిమెంట్ రోడ్లను 12 మీటర్లకు పెంచాలని డీడీఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. పీఆర్ ఇంజనీరింగ్ పనులపై ఆ శాఖ డీఈఈ సత్యశ్రీనివాస్ సమగ్ర సమాచారంతో రాకపోగా అడిగిన వాటికి సక్రమంగా సమాధానం చెప్పకపోవడంతో ఆయనపై ఎమ్మెల్యే నానాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమస్యలపై గళం విప్పారు. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బిందిలి విరీష, గుత్తుల సత్తిబాబు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, తహసీల్దారు ఎల్ఎస్ఎన్ కుమారి, ఈవోపీఆర్డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ



పిఠాపురం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి సమస్యలు వివరిస్తున్న టీడీపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్



కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు వింటున్న అదనపు కమిషనరు సుధాకర్

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

పిఠాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 'పాడా' కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అర్జీదారుల నుంచి 60 వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పురపాలక సంఘానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు నాలుగు షాపులు నిర్మించారని టీడీపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ ఫిర్యాదు చేశారు. వారు బహిరంగంగా షాపులు నిర్మించినా మునిసిపల్ అధికారులు తమకు తెలియదని చెప్తున్నారన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వాటిని తొలగించాలని కోరారు. పలు ప్రాంతాలు, కూడళ్ల వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన చెత్తకుండీల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని పిఠాపురం మహారాజా వారధి పరిరక్షణ సమితి సమన్వయకర్త యనమండ్ర సూర్యనారాయణ తెలిపారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు 9మంది ఫోన్ చేసి సమస్యలు చెప్పారని అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 17మంది అర్జీలు ఇచ్చారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థలోని పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఆర్డీవో రమణి

పెద్దాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్డీవో రమణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె పెద్దాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య-ఆరోగ్య, రెవెన్యూ లీగల్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలు లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యానేరమని, పెద్దాపురం డివిజన్‌లో గుర్తింపు పొందిన 40 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. మార్చి నెలలో 2 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 13 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు చేశామన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో వైద్య-ఆరోగ్యం, స్త్రీ-శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లు, గ్రామ, వార్డు సచివాలయాలకు మొత్తం 710 ఫ్లెక్స్ బ్యానర్లు ఇచ్చామని, వాటి ద్వారా పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రచారం నిర్వహించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు పళ్లా వాసవి, అడ్వకేట్ సత్యరవికుమార్, లోక్‌అదాలత్ సభ్యుడు కె.వెంకటాచలం, డాక్టర్లు పి.సత్యవంశీ, ఎల్.అనుష, జె.రాజేశ్వరి పాల్గొన్నారు.

'బీసీ వర్గాల రిజర్వేషన్లు 52శాతానికి పెంచాలి'

పిఠాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి లోవరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలు అధికంగా ఉన్నారని, వారి జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే 'బీసీ సమరభేరి' పోస్టర్లను సోమవారం ఆయన ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 11న అని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. బీఎస్పీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

పిఠాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించిన తమకు వేతన బకాయిలు చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నిబంధనల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి మూడు నెలల జీతాలు రావాల్సి ఉందని ఏకే మల్లవరం కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసిన లోవ గంగాధర్‌తో పాటు పలువురు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమ బకాయిల గురించి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు వచ్చేలా చూడాలని ఆయన కోరారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాపు, బీసీ, ఈబీసీ తదితర కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దుర్గాడ, ఎ.విజయనగరం, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిపి వారు దరఖాస్తు చేసుకున్న యూనిట్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఇంటర్వ్యూల నిర్వహణలో గొల్లప్రోలు ఎంపీడీవో క్రరి స్వప్న, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎండీ నాయక్ తెలిపారు. గొల్లప్రోలు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఆకాల వర్షాలకు తడిసిపోయి ఆరబెట్టిన ధాన్యం రాశులను ఆయన సోమవారం పరిశీలించారు. ఇందులో రైతులతో పాటు మిల్లర్లకు చెందిన ధాన్యం ఉన్నాయన్నారు. ధాన్యం శాంపిల్స్ సేకరించామని తెలిపారు. గొల్లప్రోలు, తాటిపర్తి, కొడవలి, చెందుర్తి, ఎ.విజయనగరం, మల్లవరం, చేబ్రోలు 1, 2 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వారు ధాన్యం శాంపిల్స్ తీసుకుని 17శాతం లోపు తేమ ఉన్నవాటిని కొనుగోలు చేస్తారన్నారు. డీఎస్‌వో వెంట గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ వున్నారు.



ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి నాయక్



సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సీతారామాలయంలో మహాన్నదానం

సామర్లకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్ద బజారు సంత మార్కెట్ వెనుక గల సీతారామాలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. సుమారు 2వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అగ్నికుల క్షత్రియుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

'గాడి తప్పిన జీవనశైలితో ఆరోగ్యానికి ముప్పు'

సామర్లకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గాడి తప్పిన జీవనశైలి, అదుపు తప్పిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి కారణంగా డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు, ఊబ కాయం వంటి పలు రోగాలతో ప్రజలు మంచానపడుతున్నారని మెడికవర్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వసంతకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ, ఆసుపత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు

కొత్తపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన సురాడ బాబు, కొత్తపేటకు చెందిన చింతకాయల ఏసేబు గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో మోటారు సైకిళ్లను దొంగిలించారని పోలీసులకు సమాచారం అందింది. వారిని అదుపులోకి తీసుకుని 12 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు.

రేపు పిఠాపురంలో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

పిఠాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయని కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృపారావు, కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. యూత్ మెన్, ఉమెన్ జట్ల ఎంపిక జరుగుతుందని చెప్పారు. పాల్గొనదలచిన వారు 2007-08లో జన్మించిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఇక్కడ ఎంపికైన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందుతారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9989001162 నెంబరును సంప్రదించాలని సూచించారు.

11న పెద్దాపురంలో మెగా జాబ్ మేళా

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో పెద్దాపురంలోని ఎస్ఆర్‌వీబీఎస్‌జేబీ మహారాణి కళాశాలలో ఈ నెల 11న జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సుమారు 35 ప్రముఖ కంపెనీల్లో 1097 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

12న చేబ్రోలులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఈ నెల 12వ తేదీన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరగనున్నాయి. సీతారామస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏటా రథోత్సవం అనంతరం ఈ పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అడవి పుంత మార్గంలో జరిగే పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎడ్ల జతలు వస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పీఆర్‌లో జాబ్ మేళా 35 మందికి ఉద్యోగాలు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఐటీసీ, వికాస, కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. జిల్లాలోని వివిధ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలకు చెందిన 35మంది విద్యార్థులు ఎంపిక కాగా వారికి నియామక పత్రాలు అందజేసినట్టు ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి అప్రెంటిస్ కాలానికి ఏడాది పాటు నెలకు రూ.13 వేలు, పూర్తయ్యాక నెలకు రూ.25వేలు జీతం లభిస్తుందన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

పెద్దాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణ, రూరల్ పరిధిలోని దివిలి, కాండ్రకోట గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి సోమవారం ప్రారంభించారు. కొత్తెం వెంకటశ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని, మున్సిపల్ కమిషనరు కేవీ పద్మావతి, ఎంపీడీవో శ్రీలలిత పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జి వాసంతి బదిలీ

పిఠాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.వాసంతి బదిలీ అయ్యారు. ఆమెను పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతపురం జిల్లా గుత్తి ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి బదిలీపై పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

బధిరులకు ఉచితంగా మొబైల్ ఫోన్లు

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆరు గురు బధిరులకు రూ.15వేలు విలువైన మొబైల్‌లను కలెక్టర్ షాన్ మోహన్ ఉచితంగా అందజేశారు. జడ్పీ సీఈవో, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఇన్‌చార్జి ఏడీ లక్ష్మణరావు, సూపరింటెండెంట్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని గంగిరావిచెట్టు వీధిలో రోడ్డును నిర్మించాలని పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామస్థులు కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. 30 ఏళ్లుగా రోడ్డు నిర్మించకపోవడంతో అనేక ఇక్కట్లు పడుతున్నామని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా తమ గోడు పట్టించుకుని రోడ్డు నిర్మించాలని కోరారు.

'వక్ఫ్ సవరణ బిల్లుపై వైసీపీ అసత్య ప్రచారం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, సవరణలకు ప్రతిపాదించిన ఈ బిల్లుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మద్దతు ఇచ్చారని వైసీపీ నేతలు అసత్య ప్రచారం సాగిస్తున్నారని ఉమ్మడి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన

జగ్గంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు సూపరింటెండెంట్ డాక్టర్ టి.ప్రణీత్ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పీఆర్‌ఎస్‌జీ వర్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మహిళలు, గర్భిణులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఉదయం సాయంత్రం 10నిమిషాలు నడకతో పాటు పోషకాహారం తీసుకోవాలన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏజెన్సీలో సారాను నిర్మూలించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో సారాను పూర్తిగా నిర్మూలించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. సోమవారం ఆయన సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఎక్సైజ్ సీఐ శ్రీధర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నవోదయం కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా వల్ల కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆపరేషన్ ‘కగార్’ను నిలిపివేయాలి



ధర్నా చేస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు

రంపచోడవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని, కగార్ పేరుతో ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి ఒప్పందం చేసి దేశంలో శాంతి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. తొలుత స్థానిక మర్క్స్ ఏంగిల్స్ భవనం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లాల అనసూయ, మడకం జోగమ్మ, విండెల రామారావు, కత్తుల బాలిరెడ్డి, పి.ధర్మారెడ్డి, పి.ఆదిలక్ష్మి, ఎస్.చిలకమ్మ, సీహెచ్ కాంతమ్మ, ఈ.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐ.వి.రమణ, ప్రసాద్‌దొర, వి.కన్నయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



పోలవరం నిర్వాసితుల అభిప్రాయాలను ఐటీడీఏ పీఈవోకు అందజేస్తున్న పీడీఎఫ్ కమిటీ సభ్యులు

చింతూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక అధికారి అపూర్వ భరత్ అన్నారు. సోమవారం చింతూరు పోలవరం పీడీఎఫ్ కమిటీ సభ్యులు పీవోను కలిసారు. అధికారుల సూచనల మేరకు కమిటీ పలుమార్లు నిర్వాసితులతో సమావేశమైందని పీవోకి తెలిపారు. చింతూరులో 1,411 గిరిజనేతర కుటుంబాలు ఉన్నట్లు పీవోకు వివరించారు. వారిలో 1,015 కుటుంబాల వారు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెంలో నివాసం ఉండేందుకు, 384 కుటుంబాలు పశ్చిమగోదారి జిల్లా తాడ్వాయి, 3 కుటుంబాలు వారు యాదవోలులో నివసిం చేందుకు అంగీకారం తెలపగా 9 కుటుంబాలు తటస్థంగా ఉన్నట్టు పీవో దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని పీవో వారికి వివరించారు.

వైభవంగా సీతారామచంద్రస్వామివారికి చక్రస్నానం



సీలేరు నదిలో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం అనంతరం శ్రీసీతారామచంద్రస్వామికి సోమవారం ప్రధాన అర్చకులు పవన్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు దంపతులు, ఏడీఈ కొండబాబు దంపతులు స్థానిక సీలేరు నదిలో చక్రస్నానం చేయించారు. ఈసందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామచంద్ర స్వామికి, గర్భమంతుడు పంచలోహాలకు చక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో ఉద్యోగస్తులు కొట్టు శ్రీనివాసరావు శర్మ, నూకరాజు, గ్రామస్తులు, నాగేష్, మల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం నాటికి కటాఫ్ డేట్‌గా నిర్ణయించాలి



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి బాబు

కూనవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పునరావాస కాలనీకి వెళ్లేనాటి రోజే కటాఫ్ డేట్‌గా నిర్ణయించాలని సీపీఎం మండల కార్యదర్శి బాబు అన్నారు. మండలంలో మొదటి తొమ్మిది గ్రామాలకు నోటిఫికేషన్ డేట్ 2022 కటాఫ్ డేట్‌గా పరిగణించడం వల్ల ఇప్పుడు చాలా మంది యువత నష్టపోతున్నారన్నారు. అలాకాకుండా నిర్వాసితులు పునరావాసానికి వెళ్లే తేదీని కటాఫ్ డేట్‌గా పరిగణించి, ఇప్పుడు 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను అర్హులుగా గుర్తించి పరిహారం ఇవ్వాలని కోరారు. కాంటూర్‌తో సంబంధం లేకుండా ముంపునకు గురయ్యే ప్రతీగ్రామానికి పరిహారం చెల్లించాలన్నారు. సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సున్నం రాజులు, పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి నోచుకోని గిరిజన పిల్లలు

రేషన్ డీలర్ బియ్యం ఇవ్వడం లేదని నిర్వాహకురాలు ఆరోపణ



నిర్వాహకురాలు శాంతి

మోతుగూడెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న ఎంసీడీ క్యాంప్ గ్రామంలో ఉన్న స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి నెలకు 40కిలోల బియ్యం ఇవ్వలేదని మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు కిలో శాంతి తెలిపింది. మోతుగూడెం రేషన్ డీలర్ ఇప్పటి వరకు రెండు నెలలకు సంబంధించి 80కిలోల బియ్యం ఇవ్వకపోవడంతో మధ్యాహ్న భోజనం పెట్టలేనని ఆమె తెలిపింది. రెండు నెలలుగా తన ఇంట్లో ఉన్న బియ్యంతో 22మంది పిల్లలకు వండిపెట్టానని, ఇక తాను పెట్టలేనని వాపోయింది. బియ్యం ఇస్తానని చెప్పి డీలర్ తనతో వేలిముద్ర వేయించుకున్నారు కానీ అనేకసార్లు బియ్యం ఇస్తానని చెప్పి పదేపదే మోతుగూడెం గిరిజన స్టోర్‌కు రమ్మని చెప్పి తిప్పుతున్నారని, పిల్లలకు భోజనం పెట్టడం ఇక నా వల్ల కాదని వాపోయింది. దీనిపై ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ స్పందించి జీసీసీ మేనేజర్‌కి ఫోన్ చేసి ఆమెకు వెంటనే బియ్యం ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై జీసీసీ మేనేజర్ మోతుగూడెం డీలర్‌కు ఫోన్ చేసి ఎంసీడీ గ్రామంలో ఆమెకు బియ్యం అందజేయాలని చెప్పారు.

బంగారంపై రుణాలతో వ్యవసాయాభివృద్ధి



బ్రాంచ్ మేనేజర్ అరుణ్‌కుమార్

రాజవొమ్మంగి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో బంగారంపై వంద రూపాయలకు 75పైసలు వడ్డీకి రుణాలు పొంది వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని జడ్డంగి మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. వాహన రుణ సౌకర్యం కూడా ఉద్యోగులకు ఉందన్నారు. ఫారం 16తో పాటు ఆరు నెలలు జీతం పొందినట్లుగా పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. వాహన రుణం కూడా 75పైసలు వడ్డీ ఉంటుందన్నారు. ఆధార్, పాన్‌కార్డుతో బ్యాంక్‌లో ఖాతా తెరవాలన్నారు. ఇతర మండలాల వారికి బ్యాంక్ ఖాతాతో నూతనంగా బంగారంపై రుణాలు ఇస్తున్నామన్నారు. బ్యాంక్ పరిధిలో 20వేల ఖాతాలు కొనసాగుతున్నాయన్నారు. గతేడాది 1200మంది రైతులకు రూ.5.5కోట్లు పంట రుణం ఇచ్చామన్నారు. సకాలంలో పంట రుణాలు చెల్లించి తిరిగి పొందవచ్చని అరుణ్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధికి కృషి చేస్తా

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కిర్లంపూడి: సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కిర్లంపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి జరగాంటే రోడ్లు నిర్మాణం కీలకమని ప్రణాళికబద్దంగా మండలంలో అభివృద్ధికి కృషి చేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జగపతినగరం గ్రామ పంచాయతీ పరిధిలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామాల్లో రూ.2.30కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని రోడ్లు, డ్రైన్లను నిర్మించి జగపతినగరం పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే దాదాపు రూ.70కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టీడీపీ నాయకులు తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, ఆళ్ల నానాజీ, ఆళ్ల బాబులు, మద్దాల మణికంఠస్వామి, నీలం శ్రీను, గండే కాశీ, గౌతు జగన్నాధరావు, తూము శ్రీరామ్మూర్తి, తూము పెద్ద, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కాకాడ కుమారి రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయింది. ఆమెకు ప్రధానమంత్రి ఉన్నతి స్కీం ద్వారా రూ.లక్ష రుణం మంజూరైంది. ఆ చెక్కును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, చదరం చంటిబాబు, గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు, ఏపీఎం వేదకుమారి, సీసీ కె.సత్యప్రసాద్,మండపాక అప్పన్నదొర పాల్గొన్నారు.

‘కొత్త వ్యవస్థకు శ్రీకారం’

జగ్గంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెల్లడించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గండేపల్లి మండలం కుటుంబ సాధికార సారథుల నియామకంపై అవగాహన సదస్సు మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా నెహ్రూ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని, ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఈ విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. కోర్పు లచ్చయ్యదొర, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రాజు, యర్రంశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



జగ్గంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేటకు చెందిన విలేకరి కొత్త సతీష్ జన్మదినం సందర్భంగా ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి, కోడూరి రమేష్, గారపాటి మధు, కృష్ణమోహన్, పురై వీరబాబు పాల్గొన్నారు.

అరటి రైతులకు నష్టం

శంఖవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు అరటి, మామిడి రైతులు నష్టపోతున్నారు. శనివారం సాయంత్రం వీచిన గాలులకు మండపంలో అరటిపంట నేలకొరిగింది. సోమవారం ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ అరటి పంటను పరిశీలించారు. సుమారు పది ఎకరాల్లో పంట నష్టపోయిందని నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిపారు. మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

‘ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి’

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ సోమవారం మండలంలోని ధర్మవరంలో ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ఆదర్శమెయిన్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఈ ఎన్‌రోల్‌మెంట్ ర్యాలీ పాఠశాల నుంచి ప్రారంభమైన మెయిన్ రోడ్డు మీదుగా పశువుల ఆసుపత్రి వరకు కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు ఉపయోగించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలన్నారు. గ్రామపెద్దలు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బొల్లు వెంకటేశ్వరరావు, రామకుర్తి సూరిబాబు ఉద్దండం ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు దొడ్డిపట్ల గోపాలరావు, ఎంవీ రమణ, చుక్కల గణేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఏలేశ్వరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో ఉద్యోగులు ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన కొనసాగించారు. జేఏసీ నేతృత్వంలో 45వ రోజు జీవి.రాజు, బీఎల్‌వి రమణ రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. సర్క్యులర్‌కి విరుద్ధంగా డ్రైవర్ ఎస్‌వి రమణపై అక్రమ సస్పెన్షన్ పెట్టి విధుల నుంచి తొలగించడం సరికాదని, సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఎర్ర బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. ఎన్‌ఎమ్‌యు కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యు.బి.ఎమ్ కుమార్, ఎన్‌పి రావు ఉన్నారు.

యువ నాయకత్వానికి యనమల స్ఫూర్తి

మున్సిపల్ చైర్‌పర్సన్ రూపాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రూపాదేవి

తుని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువ నాయకులకు రాజకీయ చాణుక్యుడు, మేధావి అయిన యనమల రామకృష్ణుడు స్ఫూర్తిదాయకమని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ కొచ్చెర్ల రూపాదేవి స్పష్టం చేశారు. సోమవారం ఆమె ఆమె తునిలో మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి రావాలని, యువతరంతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమంటూ యనమల పలుమార్లు ప్రస్తావించిన విషయాలను ఆమె గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో యువ నాయకులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా రాష్ట్ర ప్రభుత్వంలో సేవలందిస్తున్నారంటే దీని వెనుక యనమల విలువైన సలహాలు, సూచనలు ఉన్నాయన్నారు. తుని ప్రజలతో యనమలకు విడదీయలేని బంధమని, ఆయన రాజకీయ ప్రస్తావనంతోనే తునికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు దక్కిందన్నారు. ఆయన్ని ఈనెల 10న సత్కరించుకునే కార్యక్రమానికి తుని వేదిక అయిందని, కార్యక్రమానికి పట్టణవాసులు తరలిరావాలని కోరారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, కోడా వెంకటరమణ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా వెలుగొందడానికి ఆద్యుడు యనమల అని అన్నారు. అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం యనమల పేరు గుర్తుండిపోయేలా కార్యక్రమం చేపట్టాలని, అతి తుని ప్రజల ఆకాంక్షగా తెలుపుతున్నట్టు స్పష్టం చేశారు.

విద్యార్థులకు కిట్లు అందజేయాలి

రాష్ట్ర అబ్జర్వర్ భారతి



ఒమ్మంగిలోని స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న భారతి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేయాలని రాష్ట్ర అబ్జర్వర్ భారతి ఆదేశించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రస్టూడెంట్ కిట్2025-26 సంవత్సర మండల స్టాక్‌పాయింట్ ఒమ్మంగి స్కూల్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. భారతి మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్‌నాటికి స్టూడెంట్స్ కిట్స్ అందజేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్టూడెంట్ కిట్స్ అప్పటివరకు భద్రపరుచుకునే గదుల్లో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమాల్లో జిల్లా సీఎంవోచామంతి నాగేశ్వరరావు, ప్రత్తిపాడుఎంఈవో1 వి.రాజబాబు, ఎంఈవో2 వై. అచ్చిరాజు, ఎంఐఎస్, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తొండంగిలో భూమి పూజ చేస్తున్న రాజేష్

తొండంగి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ తెలిపారు. సోమవారం తొండంగి గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారులకు ఆయన భూమి పూజ చేశారు. అధ్వాన్నంగా ఉన్న గ్రామీణ రహదారులను బాగు చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సర్పంచ్ సోమాల ప్రసాద్, పక్కుర్తి నూకరాజు, వంశీకృష్ణ, కందా మురళి, బంటుపల్లి అన్వేష్, దూలం మురళి, మార్నీడి చంటిబాబు, మల్లిపాము సత్తిబాబు ఉన్నారు.

‘జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి’

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల నాయకులు చవ్వాకుల నరసింహమూర్తి, కీర్తి మణికంఠ అధ్యక్షతన స్థానిక ఉషోదయ పార్కు వద్ద సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానికంగా జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం వల్ల ఉన్నత చదువులు చదవాల్సిన విద్యార్థులు పదోతరగతి వరకు చదివిఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. నియోజకవర్గం కేంద్రంగా ప్రత్తిపాడులో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమై వ్యవసాయ కూలీలు, వలస కార్మికులుగా మారుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, అంగన్‌వాడీ నాయకులు లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ వెంకటలక్ష్మి, లారీ వర్కర్స్ యూనియన్ శ్రీను, యూటీఎఫ్ నాయకులు ఆర్.రామలింగేశ్వరరావు, రాజబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.హరిసత్య, బి.శ్రీరామ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే సత్యప్రభకు సత్యదేవుని ప్రతిమను అందిస్తున్న నేతలు

శంఖవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవ చేస్తున్న తనను గుర్తించి ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే సత్యప్రభకు బద్ది రామారావు, బద్ది రమణ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యేను కలిసి సత్యదేవుని ప్రతిమను ఇచ్చి సత్కరించారు. పార్టీ అందరికీ సమాన అవకాశాలిస్తుందని, పార్టీ కోసం మరింతగా పనిచేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉల్లి వీరభద్రరావు, సర్ద గోవిందు, జగదీష్, విజయ్‌కుమార్ ఉన్నారు.

‘ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు’

ఏలేశ్వరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చి నిపుణులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు బాబూరావు అన్నారు. సోమవారం తిరుమాలిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు వివిధ రంగుల కాగితాలతో తల్లిదండ్రులకు స్వాగతం ప్రేమ్ తయారుచేశారు. ఎ.ప్రసాద్ బాబు, సత్యగౌరీ, రాజ్యలక్ష్మి, రాజ్యకళ, ఆదిలక్ష్మి, రామలక్ష్మి ఉన్నారు.

బాధితులకు సాయం

శంఖవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో ఈనెల 4న విద్యుత్ ప్రమాదం వల్ల ఇల్లు అగ్నికి ఆహుతై ఇబ్బందుల్లో ఉన్న గొనగాల పార్వతి, పల్లాలోవతల్లికి అధికారులు ప్రభుత్వం సాయాన్ని అందించారు. తమకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని బాధితులు కోరారు.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామ నాయకుడు ఇళ్ళ అప్పారావు తమ్ముడు వరాలయ్య ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. కొత్తపల్లి నాయకులు బాబు, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, మండపాక బాపన్న దొర పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో అవగాహన సదస్సు

గండేపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసీ కాలేజీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ మెడికోవర్ హాస్పిటల్ సహకారంతో హెల్దీ బిగినింగ్స్ అండ్ హోప్‌ఫుల్ ఫ్యూచర్స్ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మెడికోవర్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ కె.వంశీకృష్ణ(ఎండీ, జనరల్ మెడిసన్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై సమాచారాన్ని అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్ వంశీకృష్ణకు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది సుజియా, సౌజన్య, విద్యార్థులున్నారు.

ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్యం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆసుపత్రి నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు కొనసాగింది. తల్లిబిడ్డల క్షేమం కోసం నెల తప్పిన నుంచి ప్రసవం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్లకార్డులతో ప్రదర్శించారు. టీబీ వైద్యులు అనీల్‌కుమార్, ఆసుపత్రి వైద్యులు, శ్వేత, వినీల, నర్సులు,సిబ్బంది, బ్లడ్‌బ్యాంక్, ఐసీటీఎస్ సిబ్బంది ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సౌమ్య, సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వై.రామవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానం, మెళకువలపై ప్రకృతి వ్యవసాయ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రసాయన ఎరువులు వాడకంవల్ల ఆరోగ్యకర పంటలు పండవని, నేలలో ఖనిజాలు నశిస్తాయని ఎంపీడీవో దొర సూచించారు. ప్రకృతివ్యవసాయ విధానాలను ప్రతీగ్రామంలో అమలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను తినడం వల్ల ఆరోగ్యం, ఆదాయం, ఆనందం కలుగుతుందన్నారు. డీఎల్‌ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ప్రకృతి వ్యవ సాయ పంటల స్థితిగతులను వివరించారు. పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై అనుభవాలను వివరించారు. ఎంపీపీ ఆనందరావు, ఏవో ఉషారాణి, ఏపీవో సాయిబాబాబు, ఏపీఎం భాస్కర్, ఎంపీటీసీ శుభలక్ష్మి, ఎస్ఎఫ్ఏ గంగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలి

చింతూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలని చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కోటిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని, ఏ బిడ్డ జన్మ పొందుతూ మరణించకూడదన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

మోతుగూడెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మోతుగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ నఫియా ఆధ్వర్యంలో ఆరోగ్యకర సమాజం- ఆశాజనక భవిషత్తు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, పీహెచ్‌ఎన్ జయ, ఎస్‌వీ మంగమ్మ, ఏఎన్‌ఎం ఉత్తర, కన్నమ్మ, విజయ, స్వరూప, హెల్త్ అసిస్టెంట్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వై.రామవరంలో అన్నసమారాధన

వై.రామవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని సోమవారం వై.రామవరం బస్ సెంటర్ వద్ద ఉన్న రామాలయం వద్ద అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ మహిళా సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానకార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యుడిగా సాల్మన్‌రాజు



చింతూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మార్కెట్ కమిటీ సభ్యుడిగా చింతూరుకు చెందిన పసుపులేటి సాల్మన్‌రాజు నియమితులయ్యారు. సోమవారం మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ కె.నాగభూషణంనియామక పత్రాన్ని అందజేశారు.ఆయన టీడీపీలోసీనియర్ నాయకుడిగా ఉన్నారు. గతంలో ఎస్సీ సెల్ విభాగంలో వివిధ పదవులు చేపట్టారు.

టూరిజం, పరిశ్రమల ఏర్పాటుకు రేపు వర్క్‌షాప్

రంపచోడవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో టూరిజం, పరిశ్రమల ఏర్పాటుకు ఈనెల9న ప్రజా ప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. టూరిజం అభివృద్ధి, మినీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, న్యాయవాదుల సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 49 అర్జీలు

రంపచోడవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ ప్రజల నుంచి 49అర్జీలు స్వీకరించారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఎం.రుక్మాండయ్య, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.